గుండె జబ్బు

'కరుణకుమార'

'ఆడబోతే చూడబుద్ధీ, చూడబోతే ఆడబుద్ధీ'— అని వెనుకటి కొకసామెత ఉండేది. నెలకు మూడు వందలరూపాయలు జీతంవచ్చే నిక్షేపంలాంటి తహశీల్ దారుగిరీ చేస్తుండిన రోజుల్లో ఎందువల్లనో ఆ విరక్తి అర్థంగాదు. ఎప్పుడు రిటైరయి ఇంటి పట్టున హాయిగా విశ్రాంతి తీసుకొంటామా భగవంతుడా అని, జానకిరామయ్యగారు నిత్యమూ వెయ్యి దేవుళ్లకు మ్రొక్కుకొంటూ ఉండేవారు. చివరకు ఆ మనసూతీరింది. తీరక, శాశ్వతంగా ఉట్టిగట్టుకొని ఉయ్యాలలూగే ఉద్యోగాలు గనకనా? ఏభై ఐదో సంవత్సరం వయస్సు పూర్తికావడంతోనే, ఆయన ప్రమేయం లేకుండానే, సర్కారువారే, ఇంక తమరు దయచేయ వచ్చునని ఆపెద్దమనిషిని రిటైరుచేయించి, ఉద్యోగానికి స్వస్తిచెప్పారు.

మనస్సు చపలత్వానికి అర్థమేమిటి? రిటైరు కానంతసేపేకాని, తీరా రిటైరయి, తనకూ సర్కారు ఉద్యోగానికీ రుణం తీరిపోయిందని ఆయనమనస్సుకు తోచిన క్షణం లగాయతు, ఇంకా సర్వీసులో ఉండి ఉద్యోగం చేస్తుండిన ఉద్యోగస్థుణ్ణి చూచినపుడల్లా ఆయన మనస్సు ఊ ఇదవుతూ ఉండేది. మళ్లా కొన్నాళ్లపాటు, కోటు తొడుక్కొని, నెత్తిన పాగా పెట్టుకొని, జవాన్లూ, నౌకర్లూ, చాకర్లూ వగైరా సిబ్బందితోటి, తహశీల్ దారుఉద్యోగంచేస్తే బాగుండునని ఆయ నెంతో ముచ్చటపడుతూ ఉండేవాడు. కాని ఇదేమయినా కూరగాయలబేరమా ఏమిటి? ఉద్యోగాలకోసరం దేశంలో ఉండేపోటీ ఏమిటి, రిటైరుకావలసిన ఈడులో గూడ ఇంకా నౌకరీలో ఉంచడమేమిటి? తను బ్రాహ్మణుడుగాని, ఓహీనజాతికులస్థుడైనాకాడు. తనమాత్రపుపనివాడు దొరకకరని సర్కారువారికి దిగులా, విచారమా? పాపం! ముప్ఫయ్యేళ్లు అస్థులూ చర్మమూ ధారవోసి చేసిననౌకరీ కాబట్టి, చిరకాల సహవాసంవల్ల మమకార మనేది అట్లా పీకుతూ ఉంటుంది — ఏంచేస్తాం?

దినములు గడిచినకొద్దీ అదే పరిపాటయిపోయి బాధ ఉపశమిస్తూ వచ్చింది. యుగంధరుల్లాంటి, ముగ్గురు కొడుకులు చేతికెక్కివచ్చి, పెద్దవాడు డెల్టా సూపరెంటుగానూ, రెండోవాడు ప్లీడరుగానూ, మూడోవాడు డాక్టరుగానూ — గొప్ప గొప్ప ఉద్యోగాల్లో వుండి రెండు చేతులా సంపాదించుకొంటున్నారు. ఉన్న ఒక్కకూతురుకీ సలక్షణంగా పెళ్లిచేసి, ఇంత కలిగినసంసారంలోనే పడేసి ఆబరువు దించుకొన్నాడు తాను. తామరతంపరగా ఇంటినిండా కావలసినంతమంది పిల్లలూ, మనమలూ, భార్యా, పెద్దలోగిలీ, దొడ్డీ, మేడా,— తన కెందు కింకా సంపాదించి పోగుపెట్టాలని దొర్లాట? కృష్ణా రామా గోవిందా అనుకొంటూ కూర్చుంటే తనతనువు మహారాజులా వెళ్లిపోదూ? అని ఈవిధంగా భార్యా కొడుకులూ ఊ దిగలాగుతూ వచ్చారు.

జానకిరామయ్య సర్కారునౌకరీలో ఉండి, దాన్ని రోతగించుకొనే రోజుల్లో, ఎవ్వరికీ తెలియకుండా ఆయన మనస్సులో అతిరహస్యమైన ఒక కోరిక ఉండేది. తన జీవితంలో ఎప్పటికయినా— ఆఖరుకు ఒక్కరోజయినాసరే–సన్న్యాసం స్వీకరించి మరీ ప్రాణాలు విడిచిపెట్టవలెనని, ఆయనకు అదెందువల్లనో ఒకకోరిక ఉండేది. ఈ రహస్యం ఒక్క భార్యకుతప్ప ఇక రెండోకంటివాడెవ్వడికీ తెలియదు. మనిషిజన్మ ఎత్తినతర్వాత,జీవితంలో నిజమైన విశ్రాంతీ, ఆనందమూ అనుభవించాలంటే, సన్న్యాసాశ్రమం

తీసుకోంటేనేతప్ప మరోవిధంగా అది లంభించదని ఆయన కొకవిధమైన విశ్వాసం. అట్లాంటి విశ్వాసమూ, గౌరవమూ ఉండడానికయితే ఉండేదిగాని తనవంటి వాడు చటుక్కున కౌపీనదండకమండలాలు స్వీకరించి, బుర్ర గొరగించుకొన్నట్టయితే, కత్తిమీద సాములాంటి ఆ ఆశ్రమం యథావిధిగా జరుపుకోగలమో లేమో అని, మళ్లా ఇంకోమూల జంకూ ఏర్పడుతూ ఉండేది. బ్రతికి బాగుంటే రిటైరయి వార్ధక్యం వచ్చినతర్వాత ఇంటిదగ్గర వ్యవహారాలన్నీ కొడుకులకూ, కూతురికీ, భార్యకూ అప్పగించి నిదానంమీద సన్యసిద్దామనుకొని పైకిమాత్రం ఎవ్వరితోనూ చెప్పకుండా మనస్సులోనే దాచిపెట్టుకొని ఉన్నాడు.

రిటైరయిన రెండేళ్లకు, ఒకసారి దక్షిణాదినుండి కావేరీపీఠాధిపతులు, స్వాములవారు సంచారంచేస్తూ ఆ వూరుకూడా వేంచేపు చేశారు. ఆ స్వాములవారి అట్టహాసం చూస్తే అదొక జమీందారీ అట్టహాసంగా ఉన్నదిగాని, సంసారంమీదా జీవితంమీదా రోతపుట్టి సన్యసించిన సన్యాసివ్యవహారంలాగా కనుపించలేదు. బ్రహ్మాండమైన ఓపెద్ద ఏనుగూ, నాలుగుగుర్రాలూ, గుర్రాలమీద పోలీసుయూనిఫారంవేసుకొని స్వారీచేసే ఆశ్వికులూ, చేత తుపాకులు ధరించినభటులూ, పసుపుపచ్చడవాలీల బంట్రోతులూ, ఢంకా నాబత్కానాలూ, భేరీనినాదాలూ, తూతుబాకాలూ, వెండి దండాలూ, పగటిదివ్వెలూ, మేనాలూ, బోయీలూ, ఒంటెద్దుబళ్లూ, రెండెద్దులబళ్లూ,—ఒకటేమిటి, సింహాసనంమీద కూర్చొని రాజ్యపరిపాలన చేసేరాజుకు ఉండవలసిన అంగాలలో రథమొక్కటి తప్ప మిగిలిన గజతురగపదాతులు వగైరా పరివారమంతా అట్టహాసంగా ఉన్నది. ఆ స్వాములవారెక్కడికి వెళ్లినా ఆయనకు జరిగేపూజలు పూజలుగావు, భిక్షలు భిక్షలుగావు, సత్కారాలు సత్కారాలు గావు. నాటకంటిక్కెట్లు తరగతివారీరేట్లు ఏ ప్రకారంగా నిర్ణయింపబడి ఉంటాయో, సర్కారు బందెలదొడ్డిలో తోలే పశువులకు రకంవారీగా బందెరేట్లు ఏవిధంగా ఏర్పాటు చేసి బోర్డుమీద వ్రాసి బయట తగిలిస్తారో, ఆ విధంగానే ఆ స్వాములవారి సత్కారాలు,ఒక్కొక్క రకానికి ఒక్కొక్కరేటు ప్రకారం పెద్దబల్లమీద వ్రాసి వారిబసకు బయట తగిలించే ఉంచుతారు.

సంపూర్ణభిక్షకు రెండువందల రూపాయలూ,
పీఠపూజకు నూటఏభయి రూపాయలూ,
పాదపూజకు నూరురూపాయలూ,
పాదుకలపూజకు డెబ్బయ్యయిదు రూపాయలూ,
పాదుకలకింది ధూళిపూజకు ఏభయిరూపాయలూ,
మంగళహారతికి పాతికరూపాయలూ,
గజపూజకు ఇరవైరూపాయలూ,
అశ్వపూజకు పదిరూపాయలూ.

ఈరకంవారీ పూజావిధానానికి రేట్లు ఏర్పాటు చేసి ఉంచారు. ప్రపంచంలో మనుష్యులందరూ ఒకే పూజచేసి పుట్టుతారా? వారి హెచ్చుతగ్గుల ననుసరించి, ఎవరి శక్త్యనుసారం వారు ఆయాపూజలు చేయిస్తూ ఉంటారు ఆస్వాములవారికి—

ఇంతకీ చెప్పవచ్చిం దేమంటే—ఆస్వాములవారి రాచఠీవీ, పటాటోపమూ చూచేవరకు, చిరకాలం సర్కారు అధికారాన్ని చేతిలో పెట్టుకొని చలాయించినవా డవడంచేత, సన్యసించినప్పటికీ అటువంటి పీఠాధిపత్యమే గనక లభించినట్టయితే తాను జీవితపర్యంతమూ అటువంటి అధికారంతోనూ, ఆటోపంతోనూ జరుపుకోడానికి అవకాశం ఉంటుంది గదా అని జానకి రామయ్యగారి కొకవిధమైన ఆశ పుట్టింది మనస్సులో. దేనిమీదనయినా మమకార మనేది పుట్టకుండానే ఉండాలిగాని, పుట్టిం దంటే పిశాచంలాగా పట్టుకొని వదలదు! అదిగాక సర్కారుఉద్యోగంమీద ఒకవిధమైన ఏవగింపు ఉంటూఉండినప్పటికీ, తహశీల్దారునుండి డిప్టీకలెక్టరు కాకపోతిమే అని ఇంకోతట్టు ఆయన వ్యసనపడుతూనే ఉండేవాడు. తనకంటె వెనక ప్రవేశించిన కుర్రకారంతా, తనకంటె ముందుగా డిప్టీకలెక్టర్లయి పైకి పోతుంటే, వాళ్లని చూడలేకా, చూచి ఓర్చుకోలేకా జానకిరామయ్య ఊం కుమిలిపోతుండేవాడు. చివరకు, డిప్టీకలెక్టరు అని అనిపించుకోకుండానే ఆయన రిటైరు కావలసివచ్చింది. ఆ ప్రాప్తం లేకుండానే పోయింది. పోనీ స్వాములవారిలాగు తాను

పీఠాధిపతి అయి అంత అధికారమూ చలాయించుకోడానికి లేకపోయినా, తాను సన్యసించి, ఆపీఠం స్వాములవారి కింద, అసిస్టెంటుగానో, లేక జూనియరు స్వాములవారుగానో, లేక డిప్టీస్వాములవారుగానో ప్రవేశించినట్టయితే, తనక్కూడా, అంత పెద్దది గాకపోయినా, ఓ చిన్నరకం ఏనుగూ, చెన్నపట్నం జట్కాబళ్లలాగే గుర్రాలవంటివి—ఒకరకమైన రెండుగుర్రాలూ, రెండుతుపాకులూ, నలుగురు జవాన్లూ, పెద్దస్వాములవారిలాగు బోయీలూ, మేనా లేకపోయినా పెద్దతిరపతి కొండమీదికి తీసుకొని పోయేలాంటిది ఓ డోలీవాహనమూ—ఇట్లాంటివయినా లభిస్తాయేమోనని ఆశపడి, ఆ స్వాములవారి పీఠమేమిటో, ఆ సర్వీసు ఏమిటో, ఆ రూల్సుఏమిటో, ఆ వివరాలన్నీ జానకిరామయ్య పరస్పరంగా, అతిరహస్యంగా, విచారిస్తూ వచ్చాడు. ప్రయోజనం లేకపోయింది. పీఠాధిపతులయిన స్వాములవారి కొక్కరికి తప్ప, ఆ పీఠంకింద మరొకమనిషి అటువంటి లాంఛనాలతో బ్రదకడానికి ఆస్కారం లేదని ఆయనకు తెలిసింది. నిరాశచెంది నీళ్లు వదులుకొన్నాడు.

ఓ చెడ్డకోరిక అయినా, మంచికోరిక అయినా, నెరవేరి అనుభవిస్తూవస్తుంటే మనిషికి అనేకవిధమైన తృప్తీ వికాసమూనూ. కోరికతీరకుంటేమాత్రం, అదొక వ్యసనంలాగా ఇంద్రియాలనూ మనస్సునూ పట్టి బాధిస్తూనే ఉంటుంది. చివరకదే ఒక మనోవ్యాధిలాగు కూడా మారుతూ ఉంటుంది. మరి అటువంటి మనోవ్యాధే పట్టుకున్నదో, లేక వార్ధక్యంవల్ల జరాగ్రస్త కళేబరానికి వ్యాధే అంకురించిందోగాని, ఒకరోజున జానకిరామయ్యగారికి హఠాత్తుగా జబ్బుచేసి స్మారకం లేకుండా పడిపోయాడు. టెలిగ్రాములమీద, కొడుకులూ, కోడళ్లూ, కూతురూ అల్లుళ్లూ అందరూ సమావేశమైనారు. ఏదో గుండె జబ్బు అని తీర్మానంచేశారు డాక్టర్లు. ఇక మనిషి బ్రతకడంటే బ్రతకడని నిశ్చయించుకొన్నారు. ఆయన మంచమెక్కి వారంరోజులయింది. ఇక రోజులమీదా గంటలమీదా ఉన్నదిగాని, ఆయనఘటం, అంతకుమించి ఆశ వదులుకోవలసిందని జిల్లా సర్జనుకూడా కడపటివార్నింగు ఇచ్చేసి వెళ్లిపోయాడు.

గుండెజబ్బువల్ల పడిపోయిన మనుష్యులు చివరంటా జాగ్రదవస్థలోనే ఉంటారట! మరణశయ్యమీద గంటలూ నిమిషాలూ ఎంచుకొనే జానకయ్యకు, పోయేవాళ్లం ఎట్లాగా పోతున్నాంకదా, సన్యాసం తీసుకొని ఆఖరు కొక గంట అయినా ఆ ఆశ్రమంలో ఉండి మరీ ప్రాణం విడిచిపెట్టుదామని ఒక ఆలోచన తట్టింది. భార్యనూ కొడుకులనూ పిలిచి బయటికి చెప్పేశాడు. అవసానకాలమందు తండ్రికోరిక నెరవేర్చడంకంటె ఉత్కృష్టమైన కార్యం ఆ కొడుకులకు మరొకటి ఉంటుందిగనకనా? అదిగాక ఆయన డబ్బూ, దస్కమూ, వస్తువూ వాహనమూ కోరడమే లేదు. అటువంటి వన్నీ విసర్జించి, ఇంతకౌపీనమూ, దండమూ, కమండలమూ మాత్రమే ఇప్పించవలసినదని కోరుతున్నాడు – ఆతండ్రి. బంధుకోటి యావత్తూ సంతోషించారు. వెంటనే ఆ గ్రామంలో ఉండిన ఇతర స్వాములవారినీ, వారినీ వీరినీ పదిమందిని పిలిపించి, జరగవలసినతంతు అంతా జరిపి, సమారాధనలూ, పూజలూ పునస్కారాలూ చేయించి, మర్నాడు సాయంత్రానికల్లా ఆతండ్రికి బుర్రగొరిగించి సన్యాసం ఇప్పించారు పుత్రులు—ఆహా!

ఆరాత్రికే స్వాములవారికి జబ్బు మరీ ఎక్కువైంది. ఆరాత్రి గడవదన్నారు అందరూను. గుండెజబ్బుతప్ప శరీరంలో మరొక విధమైన బాధగాని, ఆయాసంగాని, మరొకటీ మరొకటీగాని లేనందువల్ల, 'కీ' ఇవ్వని గడియారం నిలిచిపోయినట్టు గుండె టక్కున ఎప్పుడు నిలిచిపోతుందో ఏమోనని స్వాములవారికి దొడ్లోవసారాలో దర్భలు పరిచి భీష్ములవారిని అంపశయ్యమీద పరుండపెట్టినట్టు పరుండపెట్టారు. ఆ రాత్రి తెల్లవార్లూ ఇంటిల్లిపాదీ ఆయనచుట్టూ కూర్చునేవున్నారు. సూర్యోదయం వేళకు ప్రాణం ఎట్లాగా పోతుంది. మందూమాకూ వేసిమాత్రం ప్రయోజనమేమున్నది గనక అని ఎప్పుడయినా అడిగినపుడు ఇన్ని బార్లీనీళ్లో, గ్లూకోజునీళ్లో లేక ఇన్ని హార్లిక్సుపాలో గొంతుకలోపోస్తూ వచ్చారు. కాని ఆనీళ్లవల్లా పాలవల్లా గుండెకు బలమే చేరుకొన్నదో, లేక అసలు వ్యాధే తిరుగుముఖం పట్టిందోకా

అర్ధరాత్రిగడియలు గడిచి వేకువసమీపించిన కొద్దీ స్వాములవారిస్థితి చక్కబడుతూ లింగైక్య మందు తామనుకొన్నమనిషి తెల్లవారేవరకు, పెళ్లికొడుకు లాగు చక్కాలేచి కూర్చున్నాడు. ఎండబడినకొద్దీ మొఖం తేటుతేలి కలకలలాడుతూ వచ్చింది. అంతకు పూర్వంరోజునే బుర్రగొరిగించుకొని సన్యాసంతీసుకొన్నాడేమో, చీడా, చెదారం పోయి శరీరం తేలిక అయి మనిషికి రెట్టింపు ఉత్సాహం కలిగింది.

బాగానే వున్నది. చస్తా డనుకొన్నజీవి బ్రదకడం సంతోషకరమైన విషయమే. కాని పూర్వపు జానకిరామయ్యమాత్రం కాదు ఇప్పుడు. ఇప్పుడాయన స్వాములవారు. పాతపేరు పోయి చిదానందస్వాములవా రని కొత్తపేరు వచ్చింది. పూర్వంలాగా ఎవరితో అంటే వారితో మాట్లాడ్డానికిగాని, ఏదంటే అది తినడానికిగాని, ఎక్కడికంటే అక్కడికి చటుక్కున వెళ్లడానికిగాని వీల్లేదు. అసలు స్వగృహంలో ఉండడానికే వీల్లేదు. అన్నిటికంటె మిక్కిలీ పెద్దచిక్కేమిటంటే, ఎవరితోనయినా మాట్లాడవచ్చుగాని భార్యతో మాత్రం మాట్లాడ్డానికి వీల్లేదు. ఇతర నిషేధాలెన్నిఉన్నా ఆయన లెక్కపెట్టుకోలేదుగాని, ఈనిషేధమే ప్రాణానికి వచ్చింది. అందులో తాను రెండో వివాహం చేసుకొన్న భార్యకూడాను. ఇద్దరివయస్సుల్లోనూ ఓపాతికేళ్లయినా వ్యత్యాసం వున్నది. కొడుకులు ముగ్గురూ మొదటిభార్యవల్ల కలిగినా రెండో భార్యవల్ల కలిగినదే ఆ ఒక్కఆడపిల్లాను. ఈమెకాపరానికి వచ్చినతర్వాత ఆయన మిక్కిలీ ప్రేమిస్తూ వచ్చిన వస్తువుల్లో మొదటిది భార్యా, రెండవది కూతురూను. కూతురు పెద్దమనిషయి కాపరానికి వెళ్లినప్పటి నుండీ ఆయన ప్రేమానురాగాలన్నీ పూర్తిగా భార్యమీదనే నాటుకొని వేళ్లు పాతుకుపోయినవి. అసలీభార్యామూలకంగానే ఇంతకాలంవరకూ ఆయన సన్యసించకుండా, ఇంకా వార్ధక్యం రానీ, ఇంకా వార్ధక్యం రానీ చూతాం అని ముందుకు నెట్టుకొంటూ వచ్చాడు. పెద్దపెద్దచదువులు వెలగబెట్టి, గొప్పగొప్పడాక్టర్లమనుకొనేవా రందరూ చేరి తాను చచ్చిపోవడమే ఖాయమని చెప్పినందువల్ల సన్యసించాడుగాని, తానింకా భూమిమీద నూకలు రుణముండి, జీవించవలసి ఉంటుం దని ఏమాత్రం తెలిసిఉన్నా, కాస్త వెనకాముందూ యోజించి మరీచేసేవాడు ఏపనయినా— అన్నా! ఎంతపని జరిగిందీ!

పాపం! భార్యసంగతే మరీ విచారకరంగా ఉన్నది. ఆ భర్తను చూచుకొని సంతోషించాలో, దుఃఖించాలో ఆయిల్లాలి కర్థం గావడం లేదు. క్రితం రాత్రిస్థితి చూచి ఆశ వదలుకొని, పోనీ లోకంతో పాటే అని గుండె రాయిచేసుకొన్నదిగాని — మరి ఇప్పుడో! బుర్రగొరిగించుకొన్న ఆసన్యాసిని పెట్టుకొని ఆమె ఏంచేయను? అసలు మాటలాడ్డానికయినా నోచుకోని గర్భశత్రువైపోయింది ఆయిల్లాలు. ఏంబుద్ధి!

భార్యకంటెనూ బాధపడుతున్నాడు — స్వాములవారు. దిక్కుమాలిన ఆయుర్దాయం — తనకెందుకు పోయాలీ దేవుడు? ఇంకా ఎంతకాలం బ్రతకాలో! ఇంత కాచిపోయడానికైనా లేకుండా భార్యకి చేతులారా నీళ్లు వదలుకోవలసివచ్చిందిగదా! కడుపునపుట్టినవాళ్లుంటేమాత్రం—ఎక్కడికొడుకులు, ఎక్కడికోడళ్లీకాలంలో!

పెనిమిటివంట్లో ఎట్లా ఉన్నదో విచారించాలని భార్యమనస్సు పీకుతోంది. ఆమెచేతితో ఇంత పథ్యం వండించుకొని తినాలని స్వాములవారి మనస్సు పెరుకుతోంది. బయటకువస్తే తనముఖం ఆయనకంటబడుతుందేమోనని ఇంట్లో కూర్చుని భార్యఏడుపూ, బయట కోసారి వచ్చినట్టయితే ఆమెముఖమైనా గోచరిస్తుందేమో చూతామని బయట తాటాకుల వసారాలో ఈయన ఏడుపూ.

దినములు గడిచిపోతున్నవి: శరీరంలోని రుగ్మత అయితే పూర్తిగా నయమయి దారుఢ్యం చేరుకొన్నదిగాని — పరిస్థితు లేమీ బాగులేవు. ఈమధ్య కూతురే తండ్రికి ఇంత పథ్యపానాదులు చేసిపెడుతూ వచ్చింది కాని, అల్లుడు ఎంతకాలం ఓపిక పట్టుతాడు ? ఊరికి పోవా లని అతడు తొందరచేశాడు : స్వాములవారికి ఏడుపువచ్చింది. నాగతేమికానూ - భగవంతుడా అని, తలుపుచాటున

నిలబడి భోరున ఏడిచింది భార్య. అట్టే యోజించి, అత్తగారిని అల్లుడు తనతోకూడా తీసుకొనిపోయేటట్టున్నా, ఆమె జీవితపర్యంతమూ అల్లుడువద్దనే ఉండేటట్టున్నా ఏర్పాటుచేసి, కూతురునీ, భార్యనీ అల్లుడితోకూడా పంపివేశారు స్వాములవారు.

ఇక తాను స్వగృహంలో ఎంతకాలమని ఆ విధంగా ఉండగలరూ? అట్లా ఉండడం చాలా దోషమన్నారు అందరూను. వెంటనే ఇల్లువిడిచి ఊరిబయట ఆంజనేయస్వామి దేవళంలో మకాం పెట్టుకొన్నాడు. వేళకు ఎవరయినా పిలిచి భిక్షచేసి ఇంత అన్నం పెట్టితే, ఒక్కపూటమాత్రం భోజనం చేసుకొని, రెండోపూట, ఇన్నిపాలో, పండో, ఫలమో తింటూ కాలక్షేపం చేస్తూవచ్చాడు.

కాని—నానాటికి జీవితం దుర్భరంగా ఉన్నది - స్వాములవారికి. ఆవూళ్లో ఉండడానికి కష్టమనిపించింది. కొంతకాలం దేశసంచారం చేసివద్దామని, ఒకరోజుఉదయం ఎవరితోనూ చెప్పకుండా బయల్దేరి వెళ్లిపోయాడు. ఆ వెళ్లడంవెళ్లడం, గ్రామాలు, తాలూకాలు, జిల్లాలు దాటి నెలలతరబడి, సంవత్సరాలతరబడి కూడా సంచారంచేస్తూనే ఉన్నాడు— ఇల్లు బయల్దేరిన వేళావిశేషం మంచిదనే చెప్పాలి మరి: వెళ్లిన చోటనల్లా స్వాములవారికి ఎంతో గౌరవంగానూ, గొప్పగానూ భిక్షలూ సన్మానాలూ జరుగుతున్నవి: ఆయన ఇంగ్లీషు చదువుకొని, సర్కారులో గొప్ప ఉద్యోగంచేసి రిటైరయి వార్ధక్యంలో సన్యాసం తీసుకొన్న మహాజ్ఞానిఅని ఆయనమీద ప్రజలకు గౌరవమూ, భక్తీ హెచ్చు అవుతూవచ్చినవి. భిక్షచేసిన ప్రతీగ్రామంలోనూ సభలు చేసి వారికితోచిన వేదాంత విషయాలు ఉపన్యాసాలుగూడా చేస్తూవచ్చారు. అదివరకెన్నడూ వారి కావిషయంలో విశేషంకృషిలేకపోయినా, పరిస్థితులపటుత్వంవల్ల గాబోలు, నానాటికి వారికి అభ్యాసమై, ఉపన్యాసధోరణిలో పడ్డారంటే ఒళ్లుతెలియకుండా గంటలతరబడి అట్లా నోరు కట్టుపడనేపడదు. చిదానందస్వాములవారంటే కేవలం పరమశివుని అపరావతారులనీ, మహాజ్ఞానసంపన్నులనీ, వారు బొందెతోనే కైలాసం వేంచేస్తారనీ ప్రజలలో ఆయనమీద ఒకగొప్పనమ్మకమూ భక్తీ కుదిరింది. తమ సన్యాసం శుక్రమహాదశ అందుకొని ప్రజ్వలించే రోజుల్లోనే, ఒకగ్రామంలో, ఒకానొక బ్రాహ్మణ బ్రహ్మచారి యువకు డొకడు జీవితంమీద రోతపుట్టి, సన్యసిస్తానని ఆయనకాళ్లమీద పడి, శుశ్రూష చేయడానికి ఆయనతోకూడా లేచి చక్కా వెళ్లాడు. ఆ బ్రహ్మచారికి నిజంలో సన్యసించే యోగ్యత ఒంటిమీద ఉన్నా లేకపోయినా, వృద్ధాప్యంలో దేశాటనంచేసే తనకు కాస్త చేదోడు వాదోడుగా ఉంటాడని అతన్ని దగ్గర చేరదీసి, భృంగి అని ప్రియమైన నామకరణం చేసుకొని అతన్నికూడా తీసుకొనిపోయారు స్వాములవారు...

౨

ఒకరోజున ఏమి జరిగిందంటే— ఆయన దక్షిణదేశం సంచారంచేస్తూ ఒకపట్నంలో మకాం చేస్తున్నారు. ఆవూరు సబుజడ్జీగారు స్వాములవారిచిన్నతనంలో, కూడా చదువుకొన్న సహపాఠి. చిరకాలానికి కలుసుకొన్నందువల్ల సంతోషంకొద్దీ, ఆరోజు గొప్పభిక్షచేసి సాయంకాలం ఆంజనేయస్వామి దేవళంలో ఉపన్యాసం ఏర్పాటుచేశారు. అంతకు పూర్వంకూడా ఆ దేవళంలో ఉపన్యాసాలు చాలా జరిగినప్పటికీ, ఆరోజున సబుజడ్జీగారి ఉభయం కాబట్టి, ఆపట్నంలోగల ఇతర ఉద్యోగస్థులూ, ప్లీడర్లూ, మొగా ఆడా—జనమేమిటి కిటకిటలాడుతూ వచ్చారు. అసలు అప్పటి కోవారం రోజులుగా స్వాములవారి ఆరోగ్యం బాగులేకపోయినా ఆరోజున ఉపన్యాసం తప్పనిసరి అయినందువల్ల అట్లాగే వచ్చి ఉపన్యసించారు—స్వాములవారు.

ఉపన్యాసం పూర్తి అయ్యేవరకు చీకటిపడింది. జనం తోసుకొంటున్నారు. మసకమసకసంజె చీకట్లో, తోసుకొనే ఆజనసమూహంలో ఎవరో ఒకకొత్తమనిషి —ఆడమనిషి— తిరుగుతున్నట్టు స్వాములవారిదృష్టికి గోచరించింది. అన్ని వందలమంది జనంలో స్వాములవారి కొకరు కొత్తేమిటి, మరొకరు పాతేమిటనవచ్చుగాని—ఆమనిషి అదివర కాగ్రామాని కెన్నడూరాక ఆదినమే కొత్తగా వచ్చి తిరుగుతున్నట్టు ఎందువల్లనో